

# సుడిగాలి

సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి

వంకకు అవతల చవిటి బీళ్ల నుండి సుడిగాలి పైకి లేచింది. ఎండుటాకులూ, ఊపబొందూ, చెత్తాచెదారం అన్నిట్నీ తనతోబాటు పైకిలేపి ఒక వికృతాకారాన్ని పొందుతూ సురసురమని సుడి దిరుగుతూ వంకలోకి దిగింది. అక్కడ జంబుగుముల మీదబడి కంకుల్ని పగులగొట్టి దూదిని పైకిలేపుతూ గట్టున్నే ఉన్న వడ్లకళ్లంలోకి జొరబడింది.

సుడిగాలి మొహానికి కొట్టక ముందే తూరుపెత్తుతూ వున్న చేటలోని వడ్లగింజల్ని అలాగే రాశి మీద పోసి చేటను అడ్డుంచుకొన్నాడు ఓబన్న.

అందిస్తూ వున్న వడ్లచేటను కింద పడేసి, “అమ్మో! వొచ్చె వొచ్చె నా సవితి...” అంటూ ఆదరాబాదరా పరుగెత్తి వరిగడ్డితో ఆడుకుంటూ ఉన్న పిల్లలిద్దర్నీ జవురుకొని గుండెల్లో పొదువుకొని పైట చెరగు కప్పింది బాలమ్మ.

తూరుపెత్తిన తాలునంతా తిరిగి మేలుగింజల రాశిలో కలిపి, దుగ్గుదుశానాన్ని రాశినిండా, కళ్లం నిండా నెరపి మెల్లిగా గట్టెక్కింది సుడిగాలి.

“థూ... థూ...” కేకరించి వూస్తూ లేచింది బాలమ్మ.

ముందుకు సాగిపోతోన్నదల్లా ఆగి అక్కడే తిరగ సాగింది సుడిగాలి.

అటుఇటు వెంపర్లాడి కళ్లానికి చివర దొరికిన పాత చెప్పు తీసి కొంది బాలమ్మ. చెప్పు మీద మూడు సార్లు ఎంగిలి ఊసి, “సావు ముండా,” అంటూ సుడిగాలికేసి విసిరింది. మెల్లిగా అక్కణ్ణించి కదిలి, ఆగి ఆగి వెనక్కి చూస్తున్నట్లే సాగిపోయింది గాలి. అది దూరమయ్యేదాకా ఆమె తిడుతూనే ఉంది. పిల్లలు కూడా ఆమెకు తోడయ్యారు.

సుడిగాలి చేసిన చెరుపును సరిదిద్దుకునేసరికి గంటకు పైగా పట్టింది. బందెర పుల్లలతో చెత్తాచెదారాన్నంతా పక్కకు తోశారు. చేతి బలాన్నంతా ఉపయోగించి రాశిమీద చేటపాలి విసరి తాలును లేవ గొట్టారు. రాశి మొదళ్ల దగ్గర్నుంచి తెంచుతూ దండెకట్టును వేరు జేసి మళ్లీ మళ్లీ తూరుపెత్తారు.

అప్పటికే పొద్దు వాటారింది.

గెనిమల మీద మేసి వంకలో నీళ్లు తాగి చెట్ల కింద పడుకొని ఉన్నాయి ఎద్దులు. తలను కప్పి గడ్డం కిందుగా ముడేసి ఉన్న తుండుగుడ్డను విప్పి రెండు సార్లు జాడించి దానితోనే వొళ్లంతా విదిల్చుకొంది బాలమ్మ. తన చుట్టూ గాల్లోకి లేచిన వరిదువ్వలోంచే చుట్టూ పారజూసింది.

రేగుకంపలో వేళ్లు జొరిపి పళ్లు కోసుకు తింటున్నారు పిల్లలిద్దరూ. ఆకలిగొన్నారు కాబోలు.

“సుజాతా... రాండి... రాంద్రా... బువ్వ తిందాం రాంద్రి...” పిల్చింది.

గట్టు మీద వేపచెట్టు కిందకి నడిచింది. బోర్లించి వున్న గంప మీది బండను కిందకు తోసి గంప ఎత్తింది.

బుట్టలోని సద్దిగుడ్డ మీది ఎఱ్రజీమల బారును చూసి ఉలిక్కిపడుతూ గుడ్డను తొలగించింది.

తెల్లని అన్నం నిండా ఎఱ్రజీమల మంద. గిన్నెలోని మజ్జిగ మట్టు మీద పేరుకొని ఉన్న వెన్న జిడ్డు

నిండా ఎర్రజీమల దండు. మజ్జిగ నిండా తేలుతోన్న ఎర్రజీమలు.

"చొ...చొ...చొ... ఎండాకాలమట్టా పట్టినయే... వీటి మాడు పగలా..." అంటూ బుట్టను ఎండలోకి తీసి కెళ్లి నేలమీద తట్టొడిసింది.

చేతులు కడుక్కొని వచ్చి కూచున్నాడు ఓబన్న. ఎర్రచీమల్ని పట్టించుకోలేదు అతను. పచ్చడి కలుపు కొని పిడచలు చేసి మింగుతున్నాడు.

భోజనం తర్వాత చెట్టు మొదలుకు ఆనుకొని బీడీ ముట్టించాడు ఓబన్న. పిల్లలు ఇంకా తింటున్నారని తను మాత్రం అలాగే కూచుని ఉంది బాలమ్మ.

అంతలో ఏదో సరసరమని సడి. సన్నని మాటలు గాల్లో తేలుతూ తమ కేసే వస్తున్న సవ్వడి. మళ్లీ 'సుడి గాలేమో' అనుకొంది మొదట. మనుషులేనని అర్థ మయ్యేసరికి పరిశీలనగా చూసింది.

వాళ్లెవరో పోల్చుకొన్నాక అన్నం చేత్తోనే పైట సవరించుకొంటూ మొగునికేసి చూసి, "చెన్నారెడ్డి మామ వస్సాండు," అంటూ చిన్నగా చెప్పింది.

తలెత్తి నిటారుగా అయి చూశాడు ఓబన్న. కొడుకుతో కలిసి వస్తున్న చెన్నారెడ్డి కన్పించగానే దమ్ము మీద దమ్ము రెండు దమ్ముల్లో బీడీని పీల్చి ముక్కను మట్టిలో నలుపుతూ లేచి నిల్చున్నాడు.

రెండు చేల అవతల రోడ్డుమీద ఎండలో మెరుస్తూ కన్పిస్తోంది వాళ్లు దిగి వచ్చిన కారు.

"బాగుండారా చిన్నాయనా? కడపనించేనా వచ్చేది? శ్రీధరన్నా బాగుండావా? చాల్రోజులైంది రాక..." పలుకరించాడు.

"ఏమ్మీ తగ్గిపోయినట్టుండావే! సంసారమంతా నీ నెత్తినేసి యీడు పైతిరుగుల్లకు మల్లుకొన్నెడా ఏంది?" పలకరింపుల్లో భాగంగా బాలమ్మకేసి చూసి నవ్వుతూ అన్నాడు చెన్నారెడ్డి.

చిన్నగా నవ్వి తలొంచుకొని, "అత్త బాగుందా మామా?" అడిగింది ఆమె.

బాలమ్మ మొహంలోని సిగ్గులాంటి భావమేదో శ్రీధర్‌కు ముచ్చటగా అనిపించింది. ఓబన్న తనకన్నా పెద్దవాడయినప్పటికీ తనను 'అన్నా' అని సంబోధిం చటం వింతగా తోచింది.

ఆదరాబాదరా కళ్లంలోకెళ్లి వరిగడ్డి కప్పి ఉంచిన మంచాన్ని తెచ్చి చెట్టుకింద వాల్చాడు ఓబన్న. శ్రీధర్ మంచమ్మీద కూచున్నాడుగాని చెన్నారెడ్డి అక్కడ నిలబడలేదు.

ఐదెకరాల చేనికేసి సుదీర్ఘంగా చూశాడు.

నాలుగెకరాల పత్తిపైరు పీకి సేద్యం చేసి ఉంది. గుంటకతోలి యారుచేసి పెట్టి ఉంది. పొద్దుతిరుగుడు ఎత్తేందుకు సిద్ధమై ఉంది.

ఎకరా వరి కోశారు. కళ్లం పని కూడా పూర్త య్యింది.

తెగుళ్ల వల్ల పత్తి దిగుబడి దారుణంగా పడి పోయి పెట్టుబడులు కూడా దక్కలేదని రైతులంతా ఏడుస్తున్నారు.

ఓబన్న అదృష్టం, నాటిన ఎకరా వరి అయినా బాగా పండింది. రాలిన వడ్లరాశిని చూస్తుంటే ముప్పై బస్తాల దాకా అయ్యేట్టుండాయి.

చేనుగట్టు మీదుగా నడవసాగారు.

అక్కడక్కడా చేలో బైటపడిన పట్టెడులావు రాళ్లను వంగి తీసి గట్టు మీద ఉంచాడు. గెనిమల మీద పెరిగిన కంప మొలకల్ని వేర్లతో సహా పీకేందుకు ప్రయ త్నించాడు. ఒక్కోచోట గనిమను సుదీర్ఘంగా పరిశీ లించి మరీ ముందుకు సాగాడు. ఐదెకరాల చేను చుట్టి వచ్చేసరికి ఆయనకు గంటకు పైగా పట్టింది. బోరుబావి వద్ద మోటర్‌ను, స్టార్టర్‌ను పరిశీలించాడు. మోటారు చుట్టూ పెరిగిన జిల్లేడు, తంగేడుచెట్లను చూసి చిరాకు పడ్డాడు. వంకగట్టు మీద వేపచెట్ల రెమ్మలన్నీ విరిచి ఉండటం గమనించి ఆవేదన చెందాడు.

"ఒరే ఓబన్నా... మంచి సేద్దగానివని పేరుండే నీవు మంచి రైతువనే అనుకొంటి. ఇదేందిరా యిట్ట జేస్తివి?" అన్నాడు.

ఆయనకేసి ఆశ్చర్యపోతూ చూశాడు ఓబన్న.

"చేలో రాల్లు తేలితే వాటిని బైటకు మొయ్య కుండా మొండిగా దున్నేవాడు వాడేం సేద్దెగాడురా? గెట్ల మీద కంప మొలకలు పీకి పారెయ్యకుంటే మన సొప్పుతాదా? బోరు చుట్టూ తంగేడుచెట్లు, జిల్లేడు చెట్లు మాన్లయితండాయే! ఎట్ట సూడబుద్ధయిందిరా? తూరు పృక్క గెట్టును సుబ్బిగాడేమో లోపల్లోపల పొరగ దున్ను తుండాడే. గమనించినావా? నీకు చేను గుత్తకిచ్చినా మంటే మేము రోజూ వొచ్చి ఇవన్నీ చూసుకొనేందుకు కాదు నాయినా! నీ స్వంత పొలం మాదిరి చూసుకో వాల..." చెబుతున్నాడు.

చెవుల్లోంచి ఇయర్ ఫోన్స్ తీశాడు శ్రీధర్.

తను తన తండ్రితో కలిసి చిన్నతనమంతా యీ పొలాల్ని తయారుచేసేందుకు ఎంత అగచాట్లు పడిందీ వివరించాడు చెన్నారెడ్డి. రాళ్లన్నీ ఏరి మోసి మోసి తల

బొప్పి కట్టిందనీ, వంకపక్క గుట్టలన్నీ తాము ఏరి పోసినవేననీ చెప్పాడు. విధిలేని పరిస్థితుల్లో తాము టౌన్లో సంసారం పెట్టవలసివచ్చిందనీ, శరీరం అక్క డున్నా తన మనసంతా ఇక్కడే ఉంటుందనీ ఆర్ద్రంగా పలికాడు. వంకగట్టు నున్న మామిడిచెట్టును కంటికి రెప్పలా చూసుకోమన్నాడు. దాని పండ్ల రుచిని చాలా సేపు పొగిడాడు. కాయలు దించేటపుడు తను తప్పక వస్తానన్నాడు.

సరిగ్గా తూరుపు పారని గింజల్ని చేతికెత్తి గాలి తోలినపుడంతా పైకెత్తుతున్నాడు ఓబన్న.

ఊడుస్తూ, కుప్పదోస్తూ కళ్లం పని చేసుకుం టోంది బాలమ్మ.

పిల్లలిద్దరూ రేగుచెట్లలో ఉన్నారు.

పొద్దు దిగువాలు బడింది.

''నాకీ పొలం మీద అంతులేని మర్లు. దీంట్లో పండిన వడ్లబియ్యంతో బువ్వ జేసుకొని తింటేనే తృప్తి. ఆ మెతుకులు గొంతులోకి దిగినప్పుడంతా యీ గెట్ల మీద కూచుని అరచేతిలో సంగటి ముద్ద పెట్టుకొని తిన్నెట్లే ఉంటుంది. ఈ వంక చెలిమల్లో నీళ్లు తాగినట్లే ఉంటుంది,'' పరవశంతో చెబుతున్నాడు చెన్నారెడ్డి.

ఓబన్న వింటున్నాడు.

పొలం మీదా, పంటల మీదా, ఇంటి మీదా, పల్లె దనం మీదా నాన్నకున్న అనుబంధం శ్రీధర్‌కు కొత్తేమీ కాదు. పల్లె మాండలికంలోకి దిగిన ఆయన మాటల శైలిని కూడా గమనిస్తున్నాడు.

తనెప్పుడూ వీటికి దూరమే. చిన్నప్పటి నుంచీ ఇంగ్లీషు మీడియం చదువుల కోసం తనను పల్లెకు దూరంగానే పెంచాడు నాన్న. పదేళ్ల క్రితం ప్రమోషన్ వచ్చి ఆయన కూడా టౌను చేరాడు. సాఫ్ట్‌వేర్ ఇంజ నీరుగా పన్జేస్తున్న తనను హఠాత్తుగా ఇప్పుడు పల్లెకు పిల్చుకు రావటంలో ఆయన ఉద్దేశ్యమేమిటో అర్థం కాలేదు.

''ఇన్నేండ్లయింది టౌను జేరి- నేనెప్పుడూ మార్కెట్లో బియ్యం కొని తినలే. నా పొలంలో పండినవే. నా పొలం సాగుచేసే రైతులు ఒక్క ఎకరాన్నా వరి నాటాల్సిందే. నాకు సరిపోయేన్ని వడ్లు ఇవ్వాల్సిందే. అది ముందే ఒడంబడిక. ఏ రేటుంటే ఆ రేటులో గుత్త లెక్కలోకి చెల్లేసుకొంటాను,'' చెబుతూ... ''ఒరే ఓబన్నా... నీ పంట పండిందిలేరా. యీ యేడాది వడ్ల ధర మండిపోతాంది. బస్తా తొమ్మిదొందల దాకా రేటు పలుకుతాంది. ఎకరా నేలలోనే ముప్ఫయివేల రూపా యలొచ్చే...'' అన్నాడు.

''ఏం పంటలే చిన్నాయినా? బోరునీల్లన్నీ వరి మడికే సరిపాయె. నాలుగెకరాల పత్తి తెగుల్లతో నాశన మాయె. పెట్టుబడికి కూడా గతి లేకపాయె,'' ఓబన్న కష్టాలు చెప్పుకొంటున్నాడు.

శ్రీధర్ మనసులో పొలం గుత్త, పంట దిగుబడి, రైతుకు మిగులు గురించి గణన ఒకటి చకచక జరిగి పోతూ ఉంది. ఎకరాకు ఐదువేల వంతున ఐదెకరాలకు గుత్త డబ్బు ఇరవై ఐదువేలు. ఈ కారు నాలుగెకరాలు నష్టపోయినాడనుకొన్నా ఒక ఎకరం దిగుబడిలోనే గుత్త డబ్బు వచ్చె. రెండవకారు ఐదెకరాల ఫలితం వుంది గదా. మొదటికారు ఐదెకరాలు పండి వుంటే...? నిజం గానే రైతుకు ఇంత ఆదాయం వస్తోందా?

నాన్నను అడిగాడు మెల్లిగా.

చెన్నారెడ్డి మందహాసం చేశాడు. ''అదృష్టవశాత్తు ఆ ఒక్క ఎకరా అయినా వీడికి పండింది. ఇరుగు పొరుగు చేలు చూసినావు గదా. గింజల బరువుతో వంగి ఉండాల్సిన వరి ఎన్నులన్నీ నిటారుగా నీలుక్కొని ఉన్నాయి. పైరంతా మాడిపోయి ఉంది. వైరస్ దెబ్బ... నువ్వనుకొన్నట్లు పొలం మీద అంతంత ఆదాయమొచ్చే మాత్రమయితే ఇన్ని తరాలుగా రైతులంతా గట్టి కొంప లేక, సరైన తిండి లేక ఎందుకింత అధ్వాన్నంగా బతుకు తారు?'' అంటూ, ''ఎకరా వరి పండేసరికి ఎంత లేదన్నా పదివేలు ఖర్చయి ఉంటుంది,'' అన్నాడు మెల్లగా.

వాళ్ల మాటలు సరిగ్గా విన్పించలేదు బాలమ్మకు. కానీ, ఆమెకు ఓ విషయం స్పష్టంగా అర్థమవుతూ ఉంది. తాము ఒక కారు ఫలితం తీసుకొన్నారు కాబట్టి సగం గుత్త డబ్బయినా చెల్లేయాలి. అంటే పదైదు బస్తాల వడ్లు కొలిచి ఇవ్వాలి.

రాశిలో సగం కంటే ఎక్కువే మాయమవుతో న్నట్లుగా అన్పించి కడుపులో వేదన రగిలింది బాలమ్మకు. కాగు పిగిలినట్లూ, గాదె పగిలినట్లూ, గరిసె పొగిలినట్లూ ఏవేవో స్పష్టాస్పష్ట దృశ్యాలు.

రూపాయలు పండితే ఇంటి మగాడి కళ్లు మెరు స్తాయి. తిండి గింజలు పండితే ఇల్లాలి కళ్లు మెరుస్తాయి. ఎన్ని రూపాయలు పండినా ఆడమనిషికి పిడికిలి నిండదు. ఆ రూపాయలు ఆమెదాకా దొర్లిరావు. ఇంటి నిండా గింజల రాశులుంటే ఇల్లాలి పెత్తనం సాగినట్లే. చీటికిమాటికి మగాణ్ణి అడగాల్సిన పనుండదు. ఉప్పుకు పప్పుకు, ఊరగాయకు కూరగాయకు, పిల్లల ఏడుపులకూ ముసిలోల్ల నోటి తుడుపులకూ... అన్ని అవసరాల్నీ గింజలే తీరుస్తాయి.

గుత్తకు పోను మిగిలినవి తమ తిండి అవసరాన్న యినా తీర్చగలవో లేదోనని దిగులుపడుతూ ఉంది ఆమె.

"కంది విత్తినా బాగుండేది సిన్నాయనా. పత్తి నాటి నాశినమైతి. ఎంత పవర్ మందులు కొట్టినామో తెలుసునా? ఆ పవర్‌కు చెట్టంతా గిడసబారి పోయిందే గాని తెగులు యిడ్సలేదే. ఎరువులకు పురుగులకు తడిసి మోపెడైంది. అప్పు మిగిలింది. ఈ కారు పొద్దు తిరుగుడు యిత్తనాలకూ, ఎరువులకూ ఎవుని కాల్లు పట్టుకోవాలో తెలీడంలే..." వడ్లకుప్ప ఎగదోస్తూ అన్నాడు ఓబన్న.

అతనికేసి తదేకంగా చూశాడు చెన్నారెడ్డి.

"గుత్త లెక్క రొండో కారుకు సెల్లేజ్జామనుకొంటే నీకు తిండిగింజలు కావాల్సొచ్చె. నా సగం వడ్లన్నా అమ్ముతే ఎడగారు సేద్దేనికి పెట్టుబడి వస్సాదనుకొంటే, 'పిల్లోల్లకేం పెట్టాల?' అని దాని పోరు..." పెండ్లానికేసి చూస్తూ అన్నాడు. అతని గొంతులో ఆవేదనకు తోడు ఏదో అసహనం.

తలొంచుకొని పన్జేసుకొంటూ ఉంది బాలమ్మ.

చెన్నారెడ్డి ఆలోచనల్లో పడ్డాడు.

వ్యవసాయాన్ని గురించి తను వేసిన లెక్కలకీ, అందులోని వాస్తవానికీ తేడా ఏమిటో అర్థమవుతూ ఉంది శ్రీధర్‌కు.

ఓబన్న తన గోడు ఇంకా వెళ్లబోసుకొంటూనే ఉన్నాడు.

"నీ ఆలోచన కరెక్టురా అబ్బీ..." మంచమ్మీద నిటారుగా అవుతూ చెప్పాడు చెన్నారెడ్డి. "రెండ్రూపాయల కిలో బియ్యం దొరుకుతుండాయి గదా. వాటికి తోడుగా తగ్గొడ్లు కొనుక్కోడమో, ఒక అర్థెకరా ఎడగారు సొద్ద (సజ్జ) నాటుకోడమో చేస్తే కాలం గడిచిపోద్ది. ఈ వడ్లు అమ్ముకుంటే యీ కారు పెట్టుబడికి సరిపోతది."

"నువ్వు జెప్పింది నిజమేననుకో... అయినా మసూర వడ్లు పండించుకొని స్టోరు బియ్యం యాడ తింటావుతీ..."

"ఓరి తిక్కోడా..." అంటూ నవ్వాడు చెన్నారెడ్డి. "ఏది మంచి ఏది చెడు? పండించుకొంటాం కాబట్టి ఆ సంగతి మనకు తెలుసు. టౌన్లో వుండే మా పెద్ద పెద్ద ఆఫీసర్లకేం తెలుసు. ఈ స్టోరు బియ్యాన్నే మూడు సార్లు పాలిష్ పడితే సన్నబారి మసూర బియ్యం అవుతాయి. కల్తీ చెయ్యడం... సంచుల్లో నింపడం... ఫైన్‌రైస్ అని అమ్మడం... ఎలక్ట్రిక్ కుక్కర్లు వొచ్చినాయి. ఏ బియ్యమైనా మెతుకుక్కు మెతుకుక్కు అంటకుండా అన్నమయితది. గిరాకీ మహదేవ. రేటొచ్చిందంటే కల్తీ లేని బియ్యం ఎవునికీ దొరకవు."

తలెత్తి చెన్నారెడ్డికేసి అదోలా చూసింది బాలమ్మ.

రైతుగా పుట్టినవాడు ఎట్లా బతకాల్సిందీ చెబుతున్నాడు చెన్నారెడ్డి. రైతు తాత్వికత వివరిస్తున్నాడు. కష్టం చేయటంలో ఎంత ఉత్సాహాన్ని చూపుతారో ఖర్చు చేయటంలో అంత పొదుపును పాటించాలట. జిహ్వాకు అమిత మాధుర్యాన్నిచ్చే నేతి బొట్టును కూడబెట్టి వ్యాపారులకు అమ్మి ఆ సొమ్ముకు ఉప్పో మిరపకాయో తెచ్చుకొంటూ వాటితోటే ఓ పొగాకు కాడ కూడా తెచ్చుకొని దవడన పెట్టుకొని తెల్లార్లూ గడిపిన జీవితాన్ని గురించి చెబుతున్నాడు. పుట్లు పుట్లు వేరుశనక్కాయలు పండించి చింతతొక్కో మిరపకారమో నల్చుకొని ముద్ద సంగటి మింగిన వైనాన్ని గుర్తు జేస్తున్నాడు.

చివర ముక్తాయింపుగా అన్నాడు, "నా మాటిని అమ్మేసుకోరా," అని.

బాలమ్మ గుండెల్లో సన్నని దడ మొదలైంది.

ఈ వడ్ల మీద ఎంత ఆశ పెట్టుకొందనీ!

వచ్చే శనివారమే ఓ పడి వడ్లు దంచి బెల్లం బువ్వ వండి సొంబువ్వగా నైవేద్యం పెట్టి వారం చెయ్యాలనుకొంది. తర్వాతనే కూలీలకు వడ్లు కొలవటం. అది ఆచారం కూడా.

కానీ- కళ్లంలో వడ్లన్నీ కళ్ల ముందే మాయం కాబోతుండటాన్ని ఆమె జీర్ణించుకోలేకపోతోంది.

"అమోవ్... ఓమా..." మెల్లిగా తల్లి దగ్గరకొచ్చి గోముగా మూలుగుతున్నాడు పిల్లాడు.

కూతురు కూడా వచ్చింది.

వాళ్లను గమనించాడు చెన్నారెడ్డి.

"ఏమొరే? పిల్లోల్లను బడికి పంపీడంలేదా?" అడిగాడు.

"ఎందుకు లేదు చిన్నాయనా. ఇయ్యాల మేలు కళ్లమని దొబ్బినా యిడ్సిపోల. గింజలు పెట్టించకపోయి కొనక్క తినొచ్చునని ఆశ..." చెప్పాడు ఓబన్న.

పిల్లల చేతిలోని కొంగు విడిపించుకొని వాళ్లను పనికి అడ్డుపడకుండా పక్కకు నెడుతూ, "వడల గంప రానీండి..." అంది బాలమ్మ మెల్లిగా.

"సెట్టి రాడంటమా. కల్లంకాడ కూలోల్లు దండిగా ఉంటే గంపెత్తుకొని వస్సాడంట. యీడికి రాడంట..." చెప్పి మళ్లీ మూలగటం మొదలుపెట్టింది కూతురు.

మేలు కళ్లం రోజు సెట్టిగారు అదేపనిగా వడల గంప నెత్తిన పెట్టుకొని కళ్లం కాడికి వచ్చే దృశ్యం చెన్నా రెడ్డికి గుర్తొచ్చింది. గంపెడు వడ్లు తక్కువ కాకుండా తీసుకపోతాడు. ఒక విధంగా అది దోపిడీతనమే. ఆ విషయాన్నే ఓబన్నకు చెప్పాడు. వాళ్లిట్లా రైతుల కష్టాన్ని దోచుకొనే షావుకార్లు అయ్యారన్నాడు.

చేటెడు వడ్లయినా గుడ్డలో కట్టి పిల్లల నెత్తిన పెట్టి పంపుదామనుకొంది బాలమ్మ. చెన్నారెడ్డి మాట లతో ఆగిపోయింది.

పిల్లల్ని దగ్గరకు పిల్చి పదిరూపాయలు వాళ్ల చేతుల్లో పెట్టి, "కొనుక్కో పోండి," అన్నాడు చెన్నారెడ్డి.

ఓసారి తల్లికేసి ఎగాదిగా చూసి అక్కణ్ణించి కదిలారు వాళ్లు.

వడల గంప మోసాన్ని గురించి చెన్నారెడ్డి ఇంకా చెబుతూ ఉండగా బాలమ్మ అంది, "పనిబాటలోల్లూ, సిల్లరంగడోల్లూ కల్లాలను ఆసించుకోనుంటారులే మామా. అది మామూలేలే. మీరు మాత్రం లోగడ వడల గంపకు వడ్లు  పోసిండరూ?" అంది.

"మస్తుగా పోసినం. అప్పుడు తెలీలా... ఆ మోసం ఇప్పుడర్థమవుతా ఉంది," చెప్పాడు చెన్నారెడ్డి.

చెన్నారెడ్డికేసి తదేకంగా చూసింది ఆమె.

'సేద్యంతో సంబంధం తెంచుకొన్నాక అందులో లొసుగులు ఇప్పుడు తెలిసి వస్తాండయేమో!'

పిల్లలు వడలు కొనుక్కు రాలేదు. చాక్లెట్లు, బిస్కట్లతో వచ్చారు.

నేరుగా తల్లి దగ్గరకు వెళ్లి చూపించారు.

కళ్లెత్తి వాటికేసి ఓమారు చూసి తన పనిలో నిమగ్నమైంది ఆమె.

కూతురు తన చేతిలో చాక్లెట్ పెడుతోంటే మౌనంగా తిరస్కరించింది. చేటలో పెడితే తీసి పక్కన పడేసింది.

వడ్ల అమ్మకాన్ని చర్చించుకొంటున్నారు ఓబన్న, చెన్నారెడ్డిలు.

అతని పాలి వడ్లు కూడా తనే కొనుక్కుపోతా నన్నాడు చెన్నారెడ్డి. ఎరువులు, విత్తనాలు తన బంధువు అంగట్లో ఇప్పిస్తానన్నాడు.

కళ్లం అంచుల్లో రాళ్లు, మట్టిపెళ్లలు కలిసిన వడ్లను చేటలోకి తీసికొని నేముతూ రాళ్లు  ఏరుతూ ఉన్న బాలమ్మకు వాళ్ల మాటలు వింటోంటే ఒళ్లంతా శైత్యం పోస్తున్నట్లుగా అన్పించింది.

మెదడంతా ఖాళీ అవుతోన్నట్లూ, చూపులు క్రమేణా మసకబారుతోన్నట్లూ, చేటల వడ్లు అలు ముకుపోయి కనబడనట్లూ అన్పించి చేట నేలమీదకు జార విడిచింది.

"పిల్లోల్లకు ఏంబెట్టి సాకుతాడో యీ నాబట్ట..." కసిగా గొణిగింది.

కొడుకు బిస్కెట్ ఇవ్వబోతే విసురుగా వెనక్కు నెట్టింది.

కళ్లం అంచులకు ఆవైపు కుక్క ఒకటి తారట్లాడు తోంటే తుంటకట్టెతో వెంపర్లాడింది. "చేసి చేసి చేతులు పడిపాయె. బుక్కెడు బువ్వ తినేందుక్కూడా లేకుండా సేస్చాండేమీ నా బట్ట!" అంటూ గంప ఎత్తి దూరంగా విసిరింది.

పరిస్థితి చూచాయగా అర్థమైంది చెన్నారెడ్డికి.

"ఏమోరే మరి... ఖాళీ సంచులు పంపిస్తా..." అంటూ లేచి గెట్టుకేసి నడిచాడు.

ఆమె మానసిక వేదన శ్రీధర్‌కు కూడా కొంత కొంత తెలిసి వచ్చింది. నాన్నతోటి నడుస్తోంటే వెనక నించి ఆమె ఏడుపు గొంతు సన్నగా ఎగిసివస్తూ విన్పి స్తోంది.

"ఈ వడ్లు మనం కొనకుంటేనే బావుంటుందేమో నాన్నా," మెల్లిగా అన్నాడు.

"ఎవడోకడు కొంటాడు గదా..."

"అప్పుడు ఆయమ్మ ఏడుపులు మనమీద ఉండవు గదా. మనమేదో బలవంతంగా దోచుకుపోతు న్నట్లూ... ఫ్రీగా ఏమీ రావటంలేదుగదా. మనీ పే జేస్తున్నాం గదా. యీ గొడవలెందుకూ?"

"ఆ పిల్ల ఏడుపు ఆ పిల్లదిలేరా. ఎటూ అమ్ము తున్నారు కాబట్టి మన చేలో వస్తువు కొనే హక్కు మన కుంది. అవసరం కూడా ఉంది. గుత్త డబ్బు చెల్లేసి కోవచ్చు గదా..."

"ఎరువులు ఇప్పిస్తానంటివి?"

"షావుకానికి రికమెండ్ చేస్తాం. వాళ్లు అప్పిస్తారు. ఎడగారు ఏం పండితే దాన్ని తీసప్పోయి బాకీలోకి జమేసుకొంటారు. మన గుత్త లెక్క మనకు పూర్తిగా వస్తుంది."

ముందు వెళుతూ ఉన్న తండ్రికేసి తదేకంగా చూశాడు.

"బాగా పండితే గుత్త ఇస్తారు. పండకుంటే ఏడుపు మొగం పెట్టి సగానికి కోత బెడ్తారు. రెండు మూడేండ్లు నేనిట్లా నష్టపోయినా. అందుకే ఏదొక ఉపాయంతో గుత్త లెక్క రాబట్టుకొంటున్నా. చాలా

వరకూ పండిన వడ్లనే జమేసుకుంటున్నా. సెంటిమెంటు లేదని కాదు. సెంటిమెంటు కంటే లాభం పైనే గురి ఎక్కువ... తప్పదు మరి,'' కొడుకు ముందు అంతరంగాన్ని ఆవిష్కరించాడు.

మౌనంగా వింటూండిపోయాడు శ్రీధర్.

''ఇవన్నీ చూడాలనే... తెలుసుకొంటావనే నిన్ను పిల్చుకొచ్చింది.''

గట్టిగా నిట్టూర్చి తండ్రికేసి చూశాడు. ''నాకి దంతా నచ్చలేదు నాన్నా. తెలుగు గంగ వచ్చింది కాబట్టి ఎకరా లక్షన్నర దాకా రేటు ఉందంటివి. సంవత్సరానికి ఎకరాకు ఐదువేలు గుత్తంటే పావలా వడ్డీ కూడా రాదు. దానికోసం ఇన్ని ప్లాన్లు. ఇన్ని ఏడుపులు. ఇంత స్ట్రగుల్... అమ్మేసి బ్యాంకులో వేసినా ఇంతకన్నా ఎక్కువ ఇన్‌కమ్ వస్తుంది కదా. లేదూ... సిటీలో ప్లాట్ తీసికొంటే మేలు గదా...''

కొంత మౌనం తర్వాత చెప్పాడు చెన్నారెడ్డి. ''నేను ఆలోచించక కాదు. ఈ విషయంలో మాత్రం కొంత సెంటిమెంటే. నా వేర్లేవో ఇక్కడ పాతుకొని ఉన్న ఫీలింగ్ ఉంది. ఎప్పుడో మన పూర్వీకులు సంపాదించిన ఆస్తి. ఎన్ని తరాల్నుంచో మనల్ని బతికిస్తూ ఉన్న పొలం,'' అంటూ కొద్ది క్షణాల నిశ్శబ్దం తర్వాత, ''గుత్త లెక్క కాకుండా ఇంకొంత ఆదాయం కూడా వస్తాందిలే,'' అన్నాడు. ''ఈ పొలం మీదా ఇంకొంత బరక పొలం మీదా కలిపి రెండు క్రాప్‌లోన్లు తెచ్చినంలే, యాభైవేలు, యాభైవేలు లక్ష రూపాయలకు. కరువు ప్రాంతం కాబట్టి ప్రతి ఏడూ పంటనష్టం కింద ఇన్సూరెన్స్ ట్వంటీ పర్సంటో థర్టీ పర్సంటో వస్తుంది. పాతిక వేలకు తగ్గదు.''

ఆశ్చర్యంగా చూశాడు శ్రీధర్. ''క్రాప్ డామేజి ఇన్సూరెన్స్ పంట పండించేవానికి గదా రావాల్సింది. వాళ్లు గదా పెట్టుబడి పెట్టి కరువుల వల్ల నష్టపోయేది?''

''పాస్‌బుక్కులు మన పేరు మీదే ఉంటాయి. మనమే లోను తెచ్చుకుంటాము. ప్రీమియం కూడా మన పేరు మీదే. ఇన్సూరెన్స్ మనకే వస్తుంది. పొలాల్ని దున్నలేక కోరుకో గుత్తకో ఇచ్చేవాళ్లంతా ఇంతే... ఇట్లే చేస్తారు.''

''ఇంత ఫ్రాడ్ చేసినా అర్ధరూపాయి వడ్డే. పొలాలు అమ్మి సొమ్ము చేసుకోవటమే నా దృష్టిలో తెలివైన పని,'' చెప్పాడు శ్రీధర్.

పొలంకేసి తలెత్తి చూశాడు చెన్నారెడ్డి. ఆ చూపులు అట్లా అట్లా కదిలి కళ్లం దాకా వెళ్లి వెనుదిరిగాయి.

కళ్లంలో బాలమ్మ ఏడుస్తూ తిడుతూనే ఉంది. ఒక పెద్ద సుడిగాలి వచ్చి కళ్లంలో గింజలన్నిట్నీ ఎత్తుకు పోతున్నట్లు అనిపించి గుండెలు బాదుకొంది. పిల్లల నోరు తీపి జేసేందుకు కొత్త వడ్లతో నాలుగు వడలు కొనలేని తన అశక్తతను తిట్టుకోసాగింది. కాశినాయన స్వామికి వడ్లు తీయలేనందుకూ, స్వామి బువ్వ వండి నైవేద్యం పెట్టలేనందుకూ రోదించసాగింది. ఆ శోకం లోనే కోపం ముంచుకొచ్చి ఎదురుగా నిలువెత్తు సుడి గాలి ఉన్నట్లుగా భ్రమించి, ''థూ థూ థూ... సావు నా సవితీ...'' అంటూ పాత చెప్పు మీద ఎంగిలి పూసి విసిరింది.

అది చెన్నారెడ్డి వెళ్లిన దిశగా ఎగిరిందో, తన మొగుని దిశగా ఎగిరిందో ఆమె పట్టించుకోలేదు.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 14 జూన్ 2009*

